


నేడు గుంకలాంకు పవన్ రాక

ప్రజాశక్తి- విజయనగరం

జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఆదివారం జిల్లాకు రానున్నారు. 'జగనన్న ఇళ్లు..పేద ప్రజల కన్నీళ్లు' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్మితమవుతున్న జగన్న కాలనీలను జనసేన పరిశీలించి పేదల కష్టాలు తెలుసుకుంటున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్రంలోనే అతి పెద్ద కాలనీగా గుర్తింపు పొందిన గుంకలాం జగనన్న కాలనీని ఆయన ఆదివారం పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 10.30గంటలకు విశాఖ ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో విజయనగరం చేరుకుంటారు. ఆర్అండ్బి, కలెక్టరేట్ మీదుగా ద్వారపూడి మీదుగా గుంకలాం చేరుకుంటారు. ఈ కాలనీను సిఎం జగన్మోహన్రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించడం, అదే కాలనీలో ప్రజలు కష్టాలను పవన్ తెలుసుకోవడానికి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

విభజన హామీలు అమలు చేయాల్సిందే

- రెండోరోజూ వామపక్షాల ఆధ్వర్యాన నిరసనలు
- గాంధీ విగ్రహాలకు వినతులు





లక్కవరపుకోటలో గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపడుతున్న సిపిఎం శ్రేణులు

రాజాంలో నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

విభజన హామీలను అమలు చేయాలని, మోడీ విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యాన శనివారం జిల్లాలో పలుచోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ ప్రధాని రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నల్ల చట్టాలు తీసుకువచ్చి కార్పొరేట్ల ప్రయోజనం కోసం పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. ఎంతో మంది త్యాగాల ఫలితంగా ఏర్పడిన విశాఖ స్టీల్ప్లాంట్ను మోడీ ప్రయివేటీకరించాలని చూడటం దారుణమన్నారు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని చెప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన మోడీకి రాష్ట్రంలో తిరిగే హక్కు లేదన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ను అన్ని రకాలుగా మోసం చేస్తున్న ప్రధానిని ప్రశ్నించకుండా అధికార వైసిపి స్వాగతం పలకడం దారుణమన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో వామపక్ష నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు ఆధ్వర్యాన నిరసన చేపట్టి, గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిల్లంపల్లి లెనిన్, అనకాపల్లి కృష్ణ, ఎం. దుర్గారావు, టి. వెంకట్రావు పాల్గొన్నారు.

వంగర : మోడీ విశాఖ పర్యటనకు వ్యతిరేకంగా రాజాం మండలంలోని రాజయ్యపేట గ్రామంలో సిపిఎం నాయకులు సిహెచ్. రామ్మూర్తి నాయుడు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్యారావు, శ్రీనివాసరావు, శంకర్రావు, తులసీరావు, సతేస్తు, శంకర్, లక్ష్మి, సత్యవతి, పవన్, తవుడు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మోడీ విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ పట్టణంలోని దేవి కూడలి వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. మోడీ గో బ్యాక్ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, సిపిఎం మండల నాయకులు చెలికాని ముత్యాలు, పోకల భాస్కర్, నులక బుజ్జి, ఎం.ఎర్నినాయుడు, కె.దేవుడు, శ్రీధర రాము, ఎ.అప్పారావు, కె.చంద్రయ్య, పి.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.రిషి, కె.నాయుడు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : లక్కవరపుకోటలోని గాంధీ బొమ్మ జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, సిఐటియు మండల అధ్యక్షులు టి.వెంకటరమణ, నాయకులు బి.అప్పలనరసమ్మ, కొండమ్మ, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్న చిన్న తగాదాలతో..

కుటుంబాలు విచ్ఛిన్నం కారాదు

- లోక్అదాలత్లో జిల్లా జడ్జి సాయి కల్యాణ చక్రవర్తి
- 11,203 కేసులు రాజీ

ప్రజాశక్తి-విజయనగరం



అదాలత్లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సాయికల్యాణ చక్రవర్తి

చిన్న చిన్న తగాదాలతో కుటుంబాలను పాడుచేసుకోవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్చక్రవర్తి అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో జరిగిన జాతీయ లోక్ అదాలత్లో ఆయన మాట్లాడారు. తగాదాల పరిష్కారం కోసం రోజుల తరబడి సమయం డబ్బులు వృథా చేసుకొని న్యాయ స్థానాల చుట్టూ తిరగవద్దని హితవు పలికారు. తగాదాలు పరిష్కారం కోసం లోక్ అదాలత్లను ఆశ్రయించి తగాదాలను ఇరు పార్టీల సమక్షంలో రాజీ చేసుకోవాలని చెప్పారు. అదాలత్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అన్ని కోర్టుల సముదాయాలలో 11,203 కేసులను రాజీచేశారు. విజయనగరంలో 2,852, పార్వతీపురంలో 1,764, బొబ్బిలి 1,864, ఎస్.కోట 673, సాలూరు 933, గజపతినగరం 784, చీపురుపల్లి 1148, కొత్తవలస 1073, కురుపాంలో 112 కేసులు రాజీ అయ్యాయి. సుమారుగా 36వేల మంది కక్షిదారులు కేసులను పరిష్కరించుకున్నారు. మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, ప్రామిసరి నోటు కేసులు, విద్యుత్ కేసులు, రాజీ పడదగిన పలు సివిల్ క్రిమినల్ కేసులను పరిష్కరించారు. జిల్లా న్యాయమూర్తితో పాటు సీనియర్ సివిల్ జడ్జి బిహెచ్వి లక్ష్మి కుమారి, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధారత్నం, ఎస్సిఎస్టి కోర్టు న్యాయమూర్తి సికిందర్ బాషా, సీనియర్ సివిల్ జడ్జి బి.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎల్. దేవి రత్న కుమారి, జ్యుడీషియల్ ఫస్ట్క్లాస్ మెజిస్ట్రేట్ బి.రమ్య, మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ కె.మొహిద్దీన్ జామృత బేగం, ఎక్సైజ్కోర్టు మెజిస్ట్రేట్ బి.విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బండారు సంజీవరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



కబ్బురు పర్వతంపై ఆర్మీ జెండాతో నాగరాజు

ఆ యువకుడు నిరుపేద.. రెక్కాడితే గాని జీవనం గడవని స్థితిలో కుటుంబం.. తండ్రి ఇటీవల మరణించడంతో తల్లికి చేదోడు వాదోడుగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు.. కానీ సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు ఆ యువకుడు.. దాతలు ముందుకు వచ్చి సహకారం అందిస్తే ఎవరెస్టు కూడా అధిరోహిస్తానని దృఢసంకల్పంతో చెబుతున్నాడు. ఆయనే ఉణుకూరుకు చెందిన నాగరాజు.

కుగ్రామం నుంచి..

ఎవరెస్టు అధిరోహణకు..

- పర్వతారోహణకు ఎంపికైన నాగరాజు
- 39 మందిలో రాష్ట్రం నుంచి ఒక్కరే
- దాతల సాయం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-రేగిడి

రేగిడి మండలం ఉణుకూరు గ్రామానికి చెందిన మెరుగుల గౌరినాయుడు, గౌరీశ్వరి కుమారుడు నాగరాజు. ఆ యువకుడు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేందుకు ఎంపికయ్యాడు. ఇటీవల ఎవరెస్ట్ అధిరోహించేందుకు ఎంపికలు నిర్వహించారు. దేశ నలుమూలల నుంచి 53 మంది బయల్దేరారు. డార్జిలింగ్లోని కబ్బురు సౌత్ పర్వతం (17,650 అడుగులు ఎత్తు) ఎక్కేందుకు సిద్ధమయ్యారు. ఏడు రోజులపాటు ఈ ప్రయాణాన్ని 53 మంది మొదలు పెట్టగా 39 మంది గమ్యాన్ని చేరుకున్నారు. అందులో మన రాష్ట్రం నుంచి నాగరాజు ఒక్కడే ఉండడం గమనార్హం. ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించేందుకు ఎంపికయ్యాడు. గతంలో ఆఫ్రికాలోనే పెద్దదైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. గతంలో ప్రముఖ వైద్యనిపుణులు దానేటి శ్రీధర్, ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ వ్యవస్థాపకులు బి.వి.రమణ ఆయనను ఆర్థికంగా ఆదుకున్నారు. ఎవరెస్టును అధిరోహణకు ఎంపికైన నాగరాజు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు.

ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి, కష్టతరమైనా గమ్యాన్ని చేరుకోవడంతో ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే తన లక్ష్యమన్నారు. ప్రభుత్వం, దాతలు సహకారం అందించాలని కోరారు.

పలువురి అభినందన

ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపిపి అప్పలనర్సమ్మ, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపిలు వి.జగన్మోహన్, టి.అచ్చెన్నాయుడు ఆ యువకుడిని అభినందనలు తెలిపారు.

ఇసుక.. అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. నాటుబళ్లతో ఇసుకను తోలుకునేందుకు అనుమతులు ఉండడంతో అక్రమార్కులకు అది వరంలా మారింది. నదుల నుంచి నాటు బళ్లతో ఇసుక తోలి.. ఒకచోటు స్టాక్ వేసి లారీలు, ట్రాక్టర్లతో పట్టణాలకు తరలించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు.



130 ఇళ్లు.. 100 నాటుబళ్లు

- నాటుబళ్లు ముసుగులో యథేచ్ఛగా ఇసుక అమ్మకాలు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసులు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలో ఇసుకాసురులు యథేచ్ఛగా ఇసుకను తరలించుకుపోతున్నారు. ప్రభుత్వం జగనన్న కాలనీలకు మండలంలో ఒక దగ్గర స్టాక్ పాయింట్ పెట్టి ఇసుకను సరఫరా చేస్తున్నారు. ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు ఓ పక్క ప్రకటన చేస్తుంటే మరోపక్క ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. చంపావతి నది పక్కన ఉన్న గ్రామాలకు చెందిన కొంతమంది నాటు బళ్లు కొని తమ గ్రామాల వద్ద ఇసుకను స్టాకు చేసుకొని రాత్రుల సమయంలో ట్రాక్టర్లు, లారీలతో ఇసుకను వేలాది రూపాయలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాటుబళ్లతో ఇసుకను ఇల్లు నిర్మించుకున్న వారే వినియోగించు కోవాలన్న నిబంధన ఉన్నా అలా జరగడం లేదు. మండలంలోని చొల్లంగిపేట నుంచి నాతవలస వరకు చంపావతి నది పక్కన ఉన్న గ్రామాల వారంతా నాటుబళ్లతో ఇసుకను తరలిస్తున్నారు. చొల్లంగిపేట పంచాయతీ పోతయ్యపాలెంలో సుమారు 130 ఇళ్లు ఉన్నాయి. అయితే ఈ గ్రామంలో సుమారుగా 100 నాటు బళ్ళు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఈ నాటుబళ్లతో నిత్యం చంపావతిలో ఉన్న ఇసుకను అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు.

గ్రామంలో ఒక్కొక్కరు ఒకచోట స్టాకును ఏర్పాటు చేసుకొని రాత్రి పూట ట్రాక్టర్లకు, లారీలకు ఈ ఇసుకను వేలాది రూపాయలకు అమ్ముకుంటున్నారు. ఈ విషయం రెవెన్యూ పోలీస్ అధికారులకు తెలిసిన పట్టించుకోవడం లేదని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ రెవిన్యూ యంత్రాంగం కలగజేసుకొని ఇసుకస్టాక్ పాయింట్లు స్వాధీనం చేసుకొని ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రముఖ వీణ, గాత్ర విద్వాంసురాలు

మల్లాప్రగడ జోగులాంబ మృతి

ప్రజాశక్తి-విజయనగరం కోట



మల్లాప్రగడ జోగులాంబ(ఫైల్)

ప్రముఖ వీణా, గాత్ర విద్వాంసురాలు మల్లాప్రగడ జోగులాంబ (81) విశాఖపట్నంలో అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. 1942 మార్చి 9న ఆమె మన విజయనగరంలో జన్మించారు. మొదట శ్రీ కవిరాయని జోగారావు వద్ద, తర్వాత వాసా కృష్ణమూర్తి వద్ద విద్యను అభ్యసించి అనేక కచేరీలు చేశారు. తరువాత విశాఖపట్నం ఆకాశవాణిలో నిలయ విద్వాంసురాలుగా పనిచేసారు. ఆకాశవాణి సంగీత సమ్మేళనం, పలు జాతీయ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. గతంలో మన విజయనగరంలో ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ద్వారం నరసింగరావు మెమోరియల్ మ్యూజిక్ స్కూల్లో అనేక కార్యక్రమాలు ఇచ్చారు. ఆమె మృతికి అసోసియేషన్ సభ్యులు ధవళ సర్వేశ్వర రావు, దూసి శివరాం శర్మ, డాక్టర్ పద్మప్రియ, చాగంటి కొండలరావు, సుధాకర్, పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి, డాక్టర్ డివి శ్రీకాంత్, డి.బాలాజీ, ఉమా బాలాజీ, సూర్యలక్ష్మి, ఉడుత్త కాశీవిశ్వేశ్వరుడు, గుండ వీరభద్రరావు రావు, ఉసిరికల చంద్రశేఖర్ రావు, అకాడమీ అధ్యాపకులు వంశీకృష్ణ, రామచరణ్ తదితరులు నివాళులు అర్పించారు.

ఉక్కు ప్రయివేటీకరణ వద్దు : డివైఎఫ్ఐ

విజయనగరం టౌన్ : విశాఖ ఉక్కుని ప్రైవేటీకరణ చేసే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, విభజన హామీలు అమలు చెయ్యాలని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్. హరీష్, ఎన్. రుద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటనకు ఏ మొహం పెట్టుకుని వచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రం విడిపోయే సమయంలో ఆంధ్ర రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు ప్రకటించినా నేటివరకూ అమలు చేయలేదని పేర్కొన్నారు. వీటిని నెరవర్చాకే ఉత్తరాంధ్ర పర్యటన చెయ్యాలని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తున్నారని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, విభజన హామీలు అమలు చేయాలని ప్రజాస్వామ్య బద్ధంగా నిరసనలు చేస్తున్న కార్మికులపై,ప్రజా సంఘాల నాయకును అక్రమంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్బంధం విధించి అరెస్టులను చెయ్యడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.


లేఅవుట్ వద్ద జనసేన నిరసన

విజయనగరం టౌన్ : జగనన్న లేఅవుట్ ఇళ్లలో జరిగిన జరిగిన మోసాలకు వ్యతిరేకంగా శనివారం గుంకలాం లేఅవుట్ వద్ద జనసేన కార్యకర్తలు నిరసన తెలిపారు. జగనన్న కాలనీ నిర్మాణం విషయంలో వైసిపి ప్రభుత్వం అక్రమాలకు పాలపడుతూ అర్హులకు మొండి చెయ్యి చూపించిందని నాయకులు మండిపడ్డారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆదాడ మోహనరావు, రౌతు సతీష్, త్యాడ రామ కృష్ణారావు(బాలు), పిడుగు సతీష్, ఏర్నాగుల చక్రవర్తి, లాలిసెట్టి రవితేజ, లోపింటి కళ్యాణ్, కె.లక్ష్మణ్యాదవ్ పాల్గొన్నారు.

గుంకలాం లేఅవుట్ను పరిశీలించిన కోలగట్ల

- పవన్ పర్యటనను స్వాగతిస్తున్నామన్న డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్



గుంకలాం లేఅవుట్లో నిర్మాణాలను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

గుంకలాంలోని జగనన్న కాలనీ లే అవుట్ను పరిశీలించేందుకు వస్తున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పర్యటనను తాము స్వాగతిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం గుంకలాం లే అవుట్ లో జరుగుతున్న గృహ నిర్మాణాల తీరును అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్, గృహ నిర్మాణ సంస్థ అధికారులు, వైసిపి నాయకులు కార్యకర్తలు, లబ్ధిదారులతో కలిసి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద లే అవుట్ గా పేరుగాంచిన గుంకలాం జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు ఆశాజనకంగా సాగుతున్నాయన్నారు. అయితే ఇక్కడ గృహ నిర్మాణాలు జరగలేనట్టు గాలి కబుర్లు విన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జగనన్న కాలనీ పరిశీలించేందుకు వస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు. అయితే అవాస్తవాలు చెప్పి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం మంచిది కాదని హితవు పలికారు. సినీ మోజుతో పవన్ వెంట వచ్చేవారందరూ ఎన్నికల సమయంలో పవన్ వెంట ఉండరన్నది గ్రహించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవ్వా,తాతకు ప్రతి నెల ఒకటో తేదీ కల్లా పింఛన్లు అందిస్తున్నారా లేదా అని పవన్ కళ్యాణ్ ఆరా తీస్తే మంచిదని అన్నారు. విజయనగరంలో జరుగుతున్న అభివద్ధిని, సుందరీకరణను చూడాలని, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును చూడాలని పవన్ కళ్యాణ్ కు సలహా ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, గృహ నిర్మాణ సంస్థ పీడీ రమణమూర్తి, డిఇ రంగారావు, వైసిపి నాయకులు ఆశపు వేణు, ఎస్వివి రాజేష్, మామిడి అప్పలనాయుడు, నడిపేన శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

అర్ఐఒపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్



రెండో శనివారం కళాశాలకు వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కార్పొరేట్,ప్రైవేట్ కళాశాలలను గాలికొదిలేస్తూ, వాటికి కొమ్ముకాస్తున్న ఇంటర్ బోర్డు అధికారిపై పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.వెంకటేష్, పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. రెండో శనివారం సెలవు ఇవ్వాల్సింది పోయి క్లాసులు నడిపి, ఆదివారం కూడా క్లాసులు పెట్టడంపై చర్యలు తీసుకోవాల్సిన అర్ఐఒ వైఖరిని ఖండించారు. జిల్లా వ్యాప్తంగా చాలా ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు గుర్తింపు లేకుండా నడుస్తున్నాయని, వీటిపై చర్యలు తీసుకోకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు, విద్యాశాఖ మంత్రి స్పందించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, రిజిస్ట్రేషన్ లేని కాలేజీల గుర్తింపును రద్దు చెయ్యాలని, లేని పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

ప్రతిభకు పదును పెడితే ఎన్నో విజయాలు


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతిభకు పదును పెడితే ఎన్నో విజయాలు సొంతం చేసుకోవచ్చని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. శనివారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో నగరపాలక సంస్థ విద్యా కమిటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం రెండవ రోజు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోటీలలో విద్యార్థులు జస్ట్ ఏ మినిట్ పోటీలో పాల్గొని ప్రతిభను కనబరిచారు. మొత్తం 101 పాఠశాలల నుండి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా టిఎల్ఎన్ మూర్తి, రవి మండ వ్యవహరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ చిన్నతనం నుండే పిల్లల్లో బెరుకుతనాన్ని, భయాన్ని పోగొట్టి నిర్భయంగా తమ మనసులోని భావాలను వ్యక్తీకరించుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యతోపాటు విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు తాళ్లపూడి సంతోషి కుమారి, బాలి పద్మావతి, మండల విద్యాశాఖ అధికారి రాజు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంతకీ ఎవరా దొంగలు?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ఇంతకీ ఎవరా దొంగలు.... ఉద్యోగాల పేరిట బురిడీ కొట్టిస్తున్న ఆ ముఠా ఎక్కడి నుంచి వచ్చింది. ఏకంగా ప్రభుత్వ శాఖలు, అందులోని అధికారుల పేర్లనే వాడేసుకుంటున్నారా? చదువుకున్న నిరుద్యోగులను అంత ఈజీగా ఎలా మోసం చేయగలుగుతున్నారు? ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మోసపోవద్దంటున్నారే తప్ప ఆలా మోసాలకు పాల్పడుతున్నవారెవరు? అన్నది ఎందుకు బయటపెట్టలేకపోతున్నారు?' ఇదీ జిల్లాలో గడిచినవారం రోజులుగా జనాల్లో సాగుతున్న చర్చ. ఇందుకు కారణం లేకపోలేదు సుమా..! మొన్న జిల్లా కలెక్టర్, నిన్న ఎపిసి, నేడు డిఎంఅండ్హెచ్ఒ వరుస ప్రకటనలు కలకలం రేపుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు తనపేరున ఫేక్ అకౌంట్లు ఓపెన్చేసి ఆర్థిక సాయం కోరుతున్నారని, బంధువులం, స్నేహితులం అంటూ ఉద్యోగాలపేరిట వసూళ్లకు పాల్పడుతున్నారని, అటువంటివారిని నమ్మ వద్దని సాక్షాత్తు జిల్లా కలెక్టర్ గత నెల 14న ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈనెల 4న 'దళారులనుగానీ, మధ్యవర్తులనుగానీ నమ్మి మోసపోవద్దు, తమ ప్రాజెక్టు పరిధిలో ఎలాంటి నియామకాలూ చేపట్టలేదు, నోటిఫికేషన్లు కూడా విడుదల చేయలేదు' అంటూ సమగ్ర శిక్ష ఎపిసి (అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్) మరో ప్రకటన విడుదల చేశారు. ఈనెల 7న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కూడా ఒక పత్రికలో వచ్చిన వార్తపై స్పందిస్తూ ఆ 587 పోస్టులకు ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయలేదని, దళారులను నమ్మి మోసపోవద్దని సలహా ఇచ్చారు. దీన్నిబట్టి నిరుద్యోగతను ఆసరా చేసుకుని, ఉద్యోగాల కల్పన పేరుతో భారీగా వాసూళ్లకు పాల్పడుతున్నట్టు అర్థమౌతోందని పబ్లిక్ టాక్. జిల్లాలో అపారమైన వనరులు ఉన్నా వాటిని పాలకులు వినియోగంలోకి తేలేదు. ముఖ్యంగా జిల్లాలో 80శాతం కుటుంబాలు ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడినవే. సాగునీటి వసతులు పెద్దగా లేకపోవడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్న సంగతి వేరేగా చెప్పనక్కర్లేదు. దీంతో, వ్యవసాయ కుటుంబాల్లోని చదువుకున్న యువతంతా చిన్నపాటి ఉద్యోగాలు, ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. ఉద్యానం, పశుపోషణలోనూ ప్రభుత్వాల ప్రోత్సహం అంతంతమాత్రమే. ఆ సబ్సిడీలు ఆమాయకలైన పేదలకు అందే పరిస్థితి లేదు. మరోవైపు ఉన్న జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ప్రభుత్వ విధానాలవల్ల మూత పడ్డాయి. కొత్త పరిశ్రమలు రాలేదు. మిగిలిన రంగాల్లోనూ జిల్లాలో పెద్దగా పురోగతి కనిపంచడం లేదు. దీంతో, చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ, ఉపాధి కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి ఉంది. కొంతమంది వలసపోలేక, కుటుంబ బాధ్యత మోయలేక సతమతమౌతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు నిరుద్యోగులకు టోకరా వేస్తున్నట్టుగా అర్థమౌతోందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఇదేదో ప్రైవేటు కంపెనీల్లోనూ, ఎక్కడో తెలియని ప్రాంతంలోనే ఇటువంటి మోసాలు జరిగితే అది వేరు. సాక్షాత్తు ప్రభుత్వ శాఖల్లోనే ఉద్యోగాలిస్తామని మోసం చేయడం, వాటిపై అధికారులు ప్రకటనలు ఇవ్వడం పట్ల ఏర్పడుతున్న అనుమానాలు పెనుభూతంగా మారుతున్నాయి. ఇలా నిరుద్యోగులను తమ శాఖల్లో ఉద్యోగాలు పేరిట మోసం చేస్తున్నారని తెలుసుకున్న అధికారులు ఇటువంటి పరిస్థితిని నియంత్రించేందుకు ఎందుకు కంకణం కట్టుకోవడం లేదో అంటూ చాలా మంది ప్రశ్నిస్తున్నారు. ఔను కదూ..! జనం చర్చించుకుంటున్నట్టు



నిరుద్యోగులు మోసపోతే వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యతగానీ, అలా మోసం చేసినవారిని పట్టుకుని శిక్షించే అధికారంగానీ అధికార యంత్రాంగానికి లేదా? మరీ పట్టనట్టుగా ఆత్మరక్షణలో పడినట్టు ప్రకటనలు, హెచ్చరికలతో సరిపెడితే ఎలా? అని కూడా చర్చసాగుతోంది. అధికారుల ప్రకటనలను బట్టి జిల్లాలో నిరుద్యోగులను పథకం ప్రకారం మోసం చేస్తున్నారన్న విషయం బయటపడింది. అధికారులకుగానీ, జిల్లాలోని పాలకులకుగానీ చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా అటువంటివారిని పట్టుకుని శిక్షించాలని పలువురు కోరుతున్నారు. ఇంతకీ పాలకులు ఏం చేస్తున్నట్టు? సందుదొరికితే అధికారులను నిలదీసే ప్రజాప్రతినిధులు నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుంటే ఏమైపోయారు? ఎంత కాలంగా ఇలా నిరుద్యోగులు మోసపోవాలి? అధికారుల ప్రకటనలను బట్టి నిరుద్యోగుల నుంచి కోట్ల రూపాయాలు టోకరా వేస్తున్నట్టుగా అర్థమౌతుందని పలువురి వాదన. ఇప్పటికైనా స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని లక్ష్మీపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 14, 17 జిల్లా స్థాయి క్రీడా పోటీలో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎస్ కృష్ణారావు తెలిపారు. ఇటీవల శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అండర్ 14 విభాగంలో ఈత పోటీల్లో కర్నేన విశ్వేశ్వరరావు, అండర్ 17లో ముంజేటి సతీష్ సత్తా చాటి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. యోగా పోటీల్లో అండర్ 14 విభాగంలో కెంబూరు చందు, అండర్ 17 విభాగంలో కర్నేన సాయి తేజ రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యారు. ఖోఖో అండర్ 14విభాగంలో పాగిరి శరణ్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 12, 13లో అనకాపల్లి సమీపంలో చోడవరం అసోసియేషన్ ఏర్పాటు చేసిన యోగా పోటీల్లో అండర్ 14 విభాగంలో మళ్ల ధనలక్ష్మి, కెంబూరు చందు, అండర్ 17 విభాగంలో కర్నేన సాయి తేజ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని సర్పంచ్ కెంబూరు తేజ వెంకటేష్, మండల విద్యాశాఖ అధికారి ఎం వరప్రసాదరావు, హెచ్ఎం నిమ్మక కృష్ణారావు, పీడీ జద్దు హైమావతి, ఎంపిటిసి అప్పలనాయుడు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వై. తవిటి నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీరాములుకు సన్మానం

ప్రజాశక్తి-బొబ్బిలి

వేదిక్ మేథ్‌మెటిక్స్‌లో డాక్టరేట్ సాధించిన బొబ్బిలికి చెందిన ఉపాధ్యాయుడు కొయ్యాన శ్రీరాములును శనివారం కోటలో టిడిపి నాయకులు బేబినాయన తదితరులు సన్మానించారు. బలిజిపేట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మేథ్స్ టీచర్‌గా పనిచేస్తున్న శ్రీరాములు హండ్రెడ్ ఇన్ఫ్లుయెన్స్ ఇండియన్స్ ఇన్ వేదిక్ మేథ్ మెటిక్స్‌లో స్థానం పొందారు. అంతే కాకుండా టాప్ 100 టీచర్స్ టీచర్స్ ఆఫ్ ఇండియా వంటి ప్రముఖ గౌరవాలను పొందారు. ఈనేపథ్యంలో ఆయనను బేబినాయనతో పాటు పలువురు ఉపాధ్యాయులు సన్మానించారు.

నేడు ప్రాథమిక స్థాయి మదింపు పరీక్ష

ప్రజాశక్తి-వేపాడ

చిట్టి గురువులు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రాథమిక స్థాయి మదింపు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ. శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామంలోనూ వాలంటీర్లు పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు. ప్రశ్నపత్రాలను ఇప్పటికే సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లకు అందజేసినట్లు తెలిపారు.

బొబ్బిలిరూరల్ : మదింపు పరీక్షకు తల్లి తండ్రులు హాజరవ్వాలని నారాయణప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెసి రాజు కోరారు. శనివారం నారాయణప్పవలస, కనిమెరకవలస గ్రామాల్లో చిట్టిగురువులు, అభ్యాసకులతో కలిసి పరీక్షకు హాజరవ్వాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పరీక్షకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. అక్షరాస్యులైన వారు తమకు అనువైన సమయంలో పరీక్షకు హాజరు కావొచ్చన్నారు.



అయ్యన్నతో కె.ఎ.నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు

అయ్యన్నను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గజపతినగరం

టిడిపి నాయకులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడిని గజపతినగరం నియోజకవర్గం టిడిపి నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల సిబిఐ పోలీసులు అయ్యన్నపాత్రుడిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు, సుమారు 50మంది నాయకులు నర్సీపట్నంలో కలుసుకొని సంఘీభావం తెలిపారు.

మానవ హక్కులపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగం భారత దేశంలో మానవ హక్కుల అమలు పరిస్థితులపై రివ్యూ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశాన్ని దళిత బహుజన శ్రామిక యూనియన్ కార్యాలయంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఆ సంఘం నాయకులు తిలకించారు. ఈ సందర్భంగా డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. చిట్టిబాబు మాట్లాడుతూ హక్కులపై విస్తతంగా అవగాహన కల్పించాలని అన్నారు. బాలల హక్కులు, మహిళల హక్కులు, దళిత ఆదివాసీల హక్కులు, ముస్లిం క్రైస్తవ మైనారిటీ హక్కులు, కస్టడీ మరణాలు, కార్మిక హక్కులు వంటి ప్రాథమిక హక్కుల అమలు తీరుతెన్నులపై ఈ సమావేశంలో చర్చించారని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ అందరివాడు సమితి జిల్లా అధ్యక్షులు బొంగ భానుమూర్తి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా నాయకులు చెలికాని లక్ష్మణరావు, మాదిగ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండియా జిల్లా చైర్మన్ జొన్నాడ చెన్నారావు, డొమెస్టిక్ వర్కర్స్ ఫోరమ్ జిల్లా కోఆర్డినేటర్ కోరుకొండ వరలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.



వైసిపి నాయకులు బీల సతీష్ ఆధ్వర్యాన విశాఖ వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

38 బస్సుల్లో జనాల తరలింపు

ప్రజాశక్తి-వేపాడ

విశాఖలో ప్రధాని మోడీ సభకు మండలం నుంచి 38 బస్సుల్లో వైసిపి నాయకులు జనాలను తరలించారు. మండలంలోని 29 పంచాయతీల పరిధిలో వైసిపి నాయకులు, కార్యకర్తలు బహిరంగ సభకు తరలి వెళ్లారు.

డిఆర్‌పేటలో 104 వైద్య సేవలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని డిఆర్‌పేట గ్రామంలో శనివారం 104 వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 85 మందికి వైద్యులు జి.వినయ్‌కుమార్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎ ఎస్.సాయిరెడ్డి, ఎంఎల్‌పి హెచ్.జానకమ్మ, ఎఎన్ఎం గోవిందమ్మ, ఆశాలు ఈశ్వరమ్మ, కనక లక్ష్మి, దేవి, అర్జునమ్మ పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- పూసపాటిరేగ

ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు బోగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలో శనివారం ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి మండల అధ్యక్షులుగా లెంక చంటిబాబును ఎన్నుకున్నారు. ఈ కమిటీ ద్వారా ఎంఆర్‌పిఎస్ ఉద్యమం బలోపేతం చెయ్యాలని రానున్న రోజుల్లో గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ ఉన్న అన్ని అనుబంధ సంఘాలు ద్వారా ఎంఆర్‌పిఎస్ వర్గీకరణ సాధించుకునే దిశగా కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు బోగి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

17 నుంచి గీతా జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ఈ నెల 17నుంచి గీతా జయంతి ఉత్సవాలు జరుపుతున్నట్లు దేవస్థానం సహాయ కమిషనర్ డి.వి.వి.ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ వచ్చేనెల 4న జరగనున్న గీతా జయంతిని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం, అనుబంధ దేవాలయాలు, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17నుంచి వచ్చే నెల 4 వరకు గీతా పారాయణం, కార్యక్రమాల నిర్వహణ జరుగుతుందని తెలిపారు.

వైభవంగా నిమజ్జనం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వల్లంపూడి గ్రామంలో శనివారం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. తప్పెటగుళ్ళు, చిడతలు, చెక్కభజన, కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహించారు.

పాఠశాలకు ఎలా వెళ్లాలి?

- పోతయ్య పాలెం విద్యార్థుల ఆవేదన
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



పాఠశాలకు వెళ్లే మార్గంలో బోరు వద్ద మురుగునీరు

ప్రజాశక్తి- డెంకాడ

తమ పాఠశాలకు ఎలా వెళ్లాలని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లే దారి బాగోలేదని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

మండలంలోని చొల్లంగిపేట పంచాయతీ పరిధి పోతయ్యపాలెంలో పాఠశాలకి వెళ్లే రహదారి గోతులమయంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో 24 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉన్నారు. నాడు నేడు కింద ఈ పాఠశాలను ఎంపిక చేసి అభివృద్ధి చేశారు. అయితే గ్రామంలో నుంచి పాఠశాలకు వెళ్లేందుకు రహదారి అస్తవ్యస్తంగా గోతులతో ఉండటంతో రహదారిలో పాఠశాలకు వెళ్లడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో అయితే గోతుల నిండా నీరు చేరి విద్యార్థులు మరిన్ని అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు ఆనుకుని ఉన్న రోడ్డు గుండా చంపావతి నది ఇసుకను నాటు బళ్లతో తరలించడం వల్ల ఈ గోతులు ఏర్పడ్డాయని విద్యార్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలకు వెళ్లేందుకు రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు.





శృంగవరపుకోట, బొబ్బిలిలో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1864 కేసులు పరిష్కరించారు. లోక్ అదాలత్‌ను సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోసెఫ్ ఫైన్ నిర్వహించారు. సివిల్ కేసులు 27, బ్యాంక్ ప్రీలిటిగేషన్ కేసు ఒకటి, మనోవర్తి కేసులు 5, ఎక్సైజ్ కేసులు 11, క్రిమినల్ కేసులు 64, చెక్ బౌన్స్ కేసులు 6, ఇతర క్రిమినల్ కేసులు 13, ఎస్‌టిసి కేసులు 1747 పరిష్కరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

కొత్తవలస : కొత్తవలస కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 1090 కేసులు పరిష్కరించినట్లు మెజిస్ట్రేట్ ఎస్.సూర్యకిరణ శ్రీ తెలిపారు.

శృంగవరపుకోట : ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టుతో పాటు ప్రత్యేక ద్వితీయ శ్రేణి న్యాయస్థానాల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 662 కేసులు పరిష్కారమైనట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి వెల్లడించారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 25 ఐపిసి కేసులు, చెక్ బౌన్స్ కేసులు 9, ప్రాంసరినోట్ కేసులు 9, ఎగ్జిక్యూటివ్ పిటిషన్ కేసులు 3, అడ్మిషన్లు 6 కేసులు.. మొత్తం 52 కేసులను న్యాయమూర్తి వాణి పరిష్కరించారు. ఇక ద్వితీయ శ్రేణి న్యాయస్థానంలో సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో 610 కేసులను పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌లో ఎపిపి పి.కేశవరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి కెవిఎస్ రామరాజు, సీనియర్ న్యాయవాదులు మండా కామేశ్వరరావు, ఎన్‌టి దాసు, గేదెల ప్రకాష్, బి.త్రిమూర్తులు, డబ్ల్యు.ఎస్.శర్మ, వియ్యపు రమణ, వారాది ఈశ్వరరావు, టివిఆర్ మూర్తి, ఆర్.సత్యనారాయణ, బి.సత్యనారాయణ, ఎం.అనురాధ, బివిఎస్ రామారావు, జి.చిట్టిబాబు, బి.వెంకటరావు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - వంగర

రాజాం మున్సిపల్ పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల ను తక్షణమే పెంపుదల చేసి, పని భారాన్ని తగ్గించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్. రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. రాజాం మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచకుండా కార్మికుల పై తీవ్రమైన పని భారాన్ని మోపుతున్నారని చెప్పారు. గత పది సంవత్సరాలుగా కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నరని, కార్మికుల సంఖ్య పెంపుదల చేయకపోవడంతో ఉన్న కార్మికుల పనిలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయ్యి అనారోగ్య పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. కార్మికులకు గత నాలుగు మాసాలుగా హెల్త్ అలవెన్సులు చెల్లించలేదని, అవుట్ సోర్సింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్సులు అమలు చేయకుండా వివక్షగా చూడటం సరైన పద్ధతి కాదని అన్నారు. అధికారులు స్థానిక సమస్యల పరిష్కారం చేయకపోతే సమ్మెకు కూడా వెనుకాడమని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాజేష్, శంకర్రావు, గిరి, కృష్ణ, చినబాబు, గురువులు, కాశీ, రాంబాబు, సుధాకర్, వెంకటి, సుగుణమ్మ, లక్ష్మి, అనిల్ కుమార్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పోరాటాలతోనే హక్కుల సాధన

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ

ప్రజాశక్తి-బొబ్బిలి

పోరాటాలతోనే కార్మిక హక్కులను సాధించుకోవచ్చని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ అన్నారు. వేణుగోపాల స్వామి ఆలయ మండపంలో శనివారం సిఐటియు మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులపై దాడి చేస్తోందన్నారు. కార్మిక చట్టాలను మార్చివేసి పెట్టుబడుదారులకు అనుకూలంగా చేయడం దుర్మార్గమన్నారు. కార్మిక చట్టాలను పరిరక్షించేందుకు, హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, కార్మికులు పాల్గొన్నారు.

నూతన మండల కమిటీ ఎన్నిక

అనంతరం సిఐటియు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.సురేష్, పి.శంకరరావు, కోశాధికారిగా రోజా, ఐదుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ

మనకు కనిపించని మరో ప్రపంచం రేడియేషన్



మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ విసి జిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న ప్రతి ఎలక్ట్రానిక్ వస్తువులోనూ రేడియేషన్ ఉంటుందని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో 'ప్రపంచ రేడియాలజీ దినోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేడియేషన్ అనేది మనకు తెలియకుండానే మన శరీరంపై చెడు ప్రభావం చూపుతుందని అన్నారు. సెల్‌ఫోన్, వాటర్ హీటర్, ఒవేన్ తదితర వాటితోపాటు ఎక్స్‌రే, సిటి, ఎంఆర్ఐ వంటి ఎలక్ట్రానిక్ స్కానింగ్ యంత్రాల నుంచి రేడియేషన్ అధికంగా ఉంటుందన్నారు. ఈ రేడియేషన్ వల్ల చర్మ వ్యాధులు, చెవి, కళ్లు, పునరుత్పత్తి వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఏ వస్తువులో ఎంత రేడియేషన్ ఉంటుందన్నదీ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సహజంగా సూర్యుని కిరణాల నుంచి కూడా రేడియేషన్ ఉంటుందన్నారు. తిరుపతి స్విమ్స్ రేడియాలజికల్ సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ ఎం.వి.రంగారావు మాట్లాడుతూ త్వరలో ఫ్యూజన్ టెక్నాలజీ అందుబాటులోకి రాబోతుందన్నారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐకి బదులుగా ఫ్యూజన్ టెక్నాలజీలో ఒకే యంత్రంతోనే మనం తెలుసుకునే వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ రేడియో గ్రాఫర్స్ అండ్ టెక్నాలజిస్ట్స్ (ఐఎస్ఆర్టి) జాతీయ కార్యవర్గ సభ్యులు కె.అంజనీకుమార్, రాజీవ్ కృష్ణన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్ డాక్టర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, విభాగాధిపతి నూకరాజు, శివసాగర్, పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : టిడిపి

ప్రజాశక్తి-బొండపల్లి

రాష్ట్రంలో జగన్ సర్కారు అరాచక పాలన సాగిస్తోందని, దీనిని అంతం చేసేందుకు ప్రతి కార్యకర్తా నడుం బిగించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ కోరారు. మండలంలోని రోళ్లవాకలో శనివారం బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు, అరెస్టులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్తు, బస్సు ఛార్జీలు పెంచారని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. ప్రజలపై భారం మోపుతూ సిఎం జగన్ 'జె' టాక్స్ రూపంలో జేబులు నింపుకుంటున్నారని ధ్వజమెత్తారు. మూడున్నరేళ్లలో గ్రామాల్లో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వేంద్రాం మాజీ సర్పంచ్ లెంక రామారావు, సీనియర్ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, తాళ్లపూడి పెద్ద సూరిబాబు, తాళ్లపూడి కృష్ణారావు, తలచుట్ల అప్పలరాజు, లెంక చిన్నంనాయుడు, లెంక సత్యనారాయణ, పైల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో ర్యాలీ చేస్తున్న శివరామకృష్ణ, నాయకులు



ఇళ్ల చుట్టూ ఉన్న మురుగునీరు

జగనన్నా.. ఇళ్ల నిర్మాణాలు ఎలాగన్నా?

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వల్లంపూడి గ్రామంలో 28 మందికి ఇళ్ల పట్టాలిచ్చారు. కానీ గ్రామానికి ఆనుకుని, వాడుకనీరు ప్రవహించే ప్రాంతంలో స్థలాలు చూపించారు. తీరా, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించే సరికి, మురుగునీరంతా అక్కడ నిలిచిపోతోంది. దీంతో కొంతమంది ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే వదిలేశారు. మరోవైపు కాలనీకి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నిర్మాణ సామగ్రి తరలించడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో మరికొంతమంది పునాది స్థాయిలోనే నిలిపేశారు. మిగిలిన వారు స్లాబ్, కొంతమంది లెంటల్ లెవెల్ వరకు నిర్మించి, పనులు ఆపేశారు. దీనిపై హౌసింగ్ ఎఇని వివరణ కోగా, సామగ్రి తీసుకెళ్లేందుకు ఇళ్ల స్థలాల వద్ద మురుగునీరు ఆటంకంగా ఉండటం వాస్తవమేనని చెప్పారు. త్వరలోనే రోడ్డు సౌకర్యం కల్పించి, మిగతా వారితో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకూ లబ్ధిదారులు చేపట్టిన పనులకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించామని వెల్లడించారు.

రిజర్వేషన్లపై అఫిడవిట్‌ను ఉపసంహరించుకోవాలి

డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మతం మారితే దళితులు కూడా ఒబిసిల కిందకే వస్తారని బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడం తగదని దళిత బహుజన శ్రామిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి చిట్టిబాబు తెలిపారు. దళితుల ఆత్మగౌరవం దెబ్బతినేలా కేంద్రం ఇచ్చిన ఈ అఫిడవిట్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బిజెపి మనువాద సిద్ధాంతాన్ని అమలుపరచడంలో భాగంగానే ఈ అఫిడవిట్ ఇచ్చిందని తెలిపారు. దళితులు మతం మారినప్పటికీ అంటరానితనం, వివక్షతకు, సాంఘిక బహిష్కరణకు గురౌతున్నారని, తీవ్ర వివక్షత ఎదుర్కొంటున్నారని జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ తెలియజేసిందన్నారు. ఈ వివక్షతను తట్టుకోలేక దళితులు క్రైస్తవ, ముస్లిం మతాల్లోకి వెళ్లిపోతున్నారని పేర్కొన్నారు. క్రైస్తవ, ఇస్లాం మతం స్వీకరించిన షెడ్యూల్ తరగతులకు ఎలాంటి ప్రయోజనాలు వర్తింపచేయరాదన్న కుట్రతో ఈ నిర్ణయం తీసుకోవడం సరికాదని తెలిపారు. మతంతో సంబంధం లేకుండా దళితులందరికీ రిజర్వేషన్ ఫలాలు అందాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేట్స్ జిల్లా చైర్మన్ బవిరెడ్డి శంకర్రావు, డిబిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు కోరుకొండ వరలక్ష్మి, నియోజక వర్గ దళిత నాయకులు పి.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఇది మైనార్టీల దగా ప్రభుత్వం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మైనార్టీల దగా ప్రభుత్వమని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్‌భాషా దుయ్యబట్టారు. శనివారం అశోక్‌బంగ్లాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిముల సమస్యలపై పోరాడుతున్న రాష్ట్ర మైనారిటీసెల్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ అక్రమ అరెస్టును ఖండించారు. విశాఖపట్నం జిల్లా మద్దిలపాలెం కార్పొరేటర్ మైనార్టీల భూములు అక్రమంగా కాజేసి ఫ్లాట్లు వేసి అమ్ముకుంటున్నారని అన్నారు. ప్రశ్నిస్తే అక్రమ అక్రమంగా జైల్లో వేయడం వలన ప్రశ్నించడం ఆగిపోతుందా ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర మైనారిటీ సెల్ మాజీ ఉపాధ్యక్షులు రషీద్, పార్లమెంట్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ అక్బర్, నాయకులు షేక్ జానీ, ఎస్ఎం సుకూర్, జాఫర్, కిశోర్, షమీమ్ ఖాన్, షేక్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నాగరాజు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి-గజపతినగరం



డాక్టర్ ఆర్.నాగరాజును సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

ఉన్నత చదువుల కోసం కర్నూలు మెడికల్ కాలేజీకి వెళ్లిన మరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.నాగరాజును ప్రస్తుత వైద్యాధికారి సాయి కృష్ణారెడ్డి ఆధ్వర్యాన సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ సాయి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పిహెచ్‌సి పరిధిలో రోగులకు డాక్టర్ నాగరాజు అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయనతో పని చేసిన అతి తక్కువ కాలంలోనే రోగులతో ఎలా మమేకమవ్వాలో తెలుసుకున్నానని అన్నారు. గర్భిణుల మరణాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు చెకప్‌లు చేస్తూ చాలామంది ప్రాణాలను కాపాడారని అన్నారు. ఆయన బాటలోనే వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ కోవిడ్ సమయంలో అంకితభావంతో ప్రజలకు సేవ చేశారని, సీజనల్ వ్యాధులైన జ్వరాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రణాళికలు రూపొందించే వారని అన్నారు. డాక్టర్ ఆర్.నాగరాజ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్, ఎంపిహెచ్ఇఒ ఎ.శ్రీనివాస్, సిహెచ్ఒ అప్పల నరసమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వరరావు, హెల్త్ సూపర్వైజర్ రమణ తదితరులు పాల్గొన్నారు

ఉత్సాహంగా పౌరాణిక నాటక పోటీలు

ప్రజాశక్తి-బొబ్బిలి



కళాకారులను సన్మానిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన

స్థానిక కళాభారతి ఆడిటోరియంలో రాజా రావు శ్వేతాచలపతి రంగారావు బహుదూర్ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పౌరాణిక నాటక పోటీలు ఉత్సాహంగా సాగాయి. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబి నాయన సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ నాటకాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో కళాకారులు, ప్రజలు హాజరయ్యారు. కళాకారులను బేబినాయన సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాకారులను, కళలను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, నట సమాఖ్య అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి సామగ్రి వితరణ

ప్రజాశక్తి-బాడంగి



గ్రంథాలయానికి సామగ్రి అందిస్తున్న కొల్లి అప్పారావు

స్థానిక శాఖా గ్రంథాలయానికి ఉపాధ్యాయులు కొల్లి అప్పారావు రూ.10 వేలు విలువైన సామగ్రిని అందజేశారు. ఈ మొత్తాన్ని శనివారం శాఖా గ్రంథాలయ అధికారి దుర్గాప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ సోమవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, వక్తృత్వం, కబడ్డీ పోటీలు, కవి సమ్మేళనం, సెమినార్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.